# ప్రతిబింబాలు

బాగా ప్రొద్దెక్కితేగాని లేవని నాకు ఈరోజు ఆరుగంటలకే మెలకువ వచ్చేసింది. ఇంత ప్రకృతి సౌందర్యములో వుండీ సూర్యోదయపు అందాల్ని రోజూ ఆస్వాదించలేక పోవటం విచారకరమైన విషయమే అయినా ఆ నిద్రలో వుండే హాయి యీ ప్రపంచంలో మరే విషయంలోనూ కనుపించదు నాకు.

వయసు మీరిపోతున్న బ్రహ్మచారిణులైన స్త్రీలు తమచుట్టూ తాము నిర్మించుకునే వింతచేష్టల కవచంలో యిదీ ఒక భాగమేమో అనుకున్నాను. నవ్వు వచ్చింది. నిజానికి నా వయసు ఎప్పుడూ జ్ఞాపకం వుండదు నాకు. ఇరవై యేళ్ళ వయసులో వున్నప్పటి నా మనఃస్థితికీ యిప్పటి స్థితికీ యేమీ భేదం కనుపించటం లేదు. అందువలననే కాబోలు 'వయసు మీరిపోతున్న' అనుకున్నపుడు అదేదో నాకు సంబంధించని విషయంలాగా హాస్యంగా అనిపిస్తుంది.

కాని యీ వూరికి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన తరువాత యీ నాలుగు నెలల్లోనూ వయసు మీరుతున్నదేమోనన్న భావన - నాకు ముప్పై అయిదేళ్ళన్న విషయం - లీలగా మనసు వెనకాతల మెదులుతున్నట్లున్నది. హాస్టలులోని ఆడపిల్లల్ని ఎగతాళి చెయ్యబుద్ధి వెయ్యటం లేదు. వాళ్లంతా చిన్నవాళ్ళలా, మరోతరం వాళ్లలా కన్పిస్తున్నారు. బహుశా అమ్మ దగ్గర లేకపోవటం వలన యీ మార్పు వచ్చి వుండవచ్చు.

అమ్మ నన్ను 'చిన్నా' అంటుంది. అన్నం తినకపోతే బ్రతిమిలాడుతుంది. అన్ని బాధ్యతలూ నవ్వుతూ నిర్వహించుకొంటుంది. అరవై ఏళ్ళు దగ్గరపడుతున్నా పురకలు పరుగులతో పనులు చేసుకుంటుంది. అమ్మకుండే ఓపిక ఉత్సాహాల్లో వీసం వంతు లేవు నాకు. జీవితం అర్థరహితంగా పేలవంగా వున్నది. పని లేకుండా ఆలోచనా లేకుండా వూరికే పడుకొని వుండటం, నిద్రపోవటం అనేవి రెండే ఇష్టమైన పనులు నాకు.

అమ్మకంటే రెట్టింపు ఉత్సాహంతో పనులు చూచుకుంటూ జీవంతో తొణికిసలాడుతూ వుండవలసిన వయసులో ఈ 'నిర్జీవత'ను వరించటంలోని మడతపేచీ ఏమిటో

నాకు తెలియదు. దీక్షతో ఆశతో ఆనందంతో పరుగులెత్తి అందుకోవలసిన చుక్కల్లాంటి విలువలు, ఆదర్శాలు యిప్పటి కాలపరిస్థితుల్లో జీవితంలో లేవని మాత్రం తెలుసు. ఎందుకు? ఎందుకు? ఎందుకు? ఒక్క ప్రశ్నే నాలుగు మూలల్నించీ నిరంతరం వినబడుతూ వున్నది.

నా దినచర్యలో ఒక ముఖ్యభాగం ఉత్తరాల కోసం ఎదురుచూడటం. పోస్టు యింకో గంటకు వస్తుందన్నప్పటి నుండి ఎదురు చూడటం ప్రారంభమౌతుంది. వాకిటి ముందు నుండి వెళ్ళే ప్రతి అడుగుల చప్పుడూ పోస్టుమేన్‌దేమోనన్న భ్రమ కలిగిస్తుంది. మనసంతా రాబోయే పోస్టుమేన్ మీదనే కేంద్రీకరించబడుతుంది. గడియారం అతి మెల్లగా కదుల్తుంది. ఇంతగా ఎదురుచూసిన వుత్తరాలకట్టలో నాకోసం ఒకటో అరో వుంటుంది. 'అమ్మ దగ్గర్నుండేనా!, 'కమల దగ్గర్నుండేనా!' అంటూ ఎవరి దగ్గర్నుండి వచ్చినా 'ఇంతేనా!' అనిపిస్తుంది.

నేను దేని కోసం ఎదురుచూస్తున్నానో నాక్కావల్సిందేమిటో నాకే తెలియదు! నిన్న యిలాగే అమ్మ దగ్గర్నుండి వచ్చిన ఉత్తరంలోని విషయం కొంతలో కొంత ఉత్సాహం కలిగించింది. ఇవాళ అమ్మ వస్తున్నది. అమ్మ దగ్గరుంటే కొంతైనా సరదాగా వుంటుంది.

"హోం సైన్సు యం.యస్సీ చదివావు. పరీక్ష కోసం నేర్చుకున్న పూరీలు తప్పించి యింకో వంట రాదాయెను. నేర్చుకోబోయి చెడగొట్టిన రెండు గుడ్డలు తప్పించి యింకో గుడ్డముక్క కత్తిరించకపోతివి. ఒక్క పనీ రాదు. ఏం చదువులు!" అంటుంది అమ్మ.

"వెధవ పనులు! నాకెందుకు లేనిపోని శ్రమ, వంటవాళ్ళూ, టైలర్లూ ఎందరో వుంటారు. డబ్బు పారేస్తే వాళ్ళు శుభ్రంగా చేసే పనులు నేనెందుకు చెయ్యాలి?" అంటాను.

అమ్మ ఉత్సాహంగా నవ్వుతుంది.

ఆమె జుట్టు వయసుతో నలుపూ తెలుపూ కాని రంగుకు మారిపోయింది. "అమెరికాలో అయితే నీ జుట్టుని మెచ్చుకుంటారు. ఈ రంగు జుట్టంటే వాళ్లకు మహా యిష్టం. ప్లాటినం బ్లాండ్..." అని ఎగతాళి చేస్తే నవ్వుతుంది...

అయినా ఎన్నాళ్ళీ అమ్మ చాటునుండటం! ందుకే యీ వూళ్ళో యిల్లు తీసుకోకుండా హాస్టలు వార్డెనుగా వుంటున్నాను. అమ్మ అన్నదగ్గరున్నది. కాని ఆమె లేని యీ నాలుగు నెలల్లోనూ యీ ఆడపిల్లల ముందు వయస్సు మీరిపోతున్నట్లుగా వున్నది నాకు.

హాస్టలు వెనగ్గా పెద్ద చెరువు. చెరువుకావల సూర్యోదయం అవుతుంది. వచ్చిన కొత్తల్లో ఒకరోజున చూశాను. పొగడపువ్వురంగు ఎరుపులో నున్నటి గోళంగా పుట్టి పసిడి

రంగును సంతరించుకొని క్రమంగా తెల్లగా మెరిసే అగ్నిగోళంగా మారిపోయాడు. 'పుట్టేటి భానుడా పుష్యరాగపు ఛాయ, పుష్యరాగములోన...' అన్న పద్యంలో మాదిరిగానే రంగులు మార్చుకున్నాడు. ఇవేళ చూస్తుండగానే పుట్టడమే తెల్లగా మెరుస్తూ పుట్టేశాడు. అమ్మ వస్తున్నదని నీకూ తెలుసా? అనుకుని నవ్వుకున్నాను.

"బాత్‌రూమ్‌లో వేన్నీళ్ళు పెట్టానమ్మా" అన్నాడు రామసుబ్బు.

"నీవూ తొందరగానే వచ్చేశావా? ఏమిటివ్వాళ విశేషం!" అన్నాను. రామసుబ్బు కళ్ళు వాల్చి నవ్వి సిగ్గుగా తలదించుకున్నాడు. రామసుబ్బు ఎప్పుడూ కళ్ళు వాల్చి సిగ్గుగా నవ్వుతాడు. సినిమాలోని అమాయకపు హీరోలాగా. అయినదానికీ కానిదానికీ అన్నిటికీ అదే నవ్వు. నాటకాల్లో వేషాలు వేస్తాడట.

ఇదీ వేషమేమో అనుకున్నాను మొదట... పైన నా టేబిల్ మీద చిన్న మెమో పుస్తకం వున్నది, తెమ్మన్నాను ఓరోజు. టేబిల్ మీదున్న పాతిక పుస్తకాలూ పట్టుకొచ్చాడు. నాక్కోపం వచ్చింది.

"నీవు స్టుపిడ్‌వా లేక అతి వినయమా?"అనడిగాను.

మొహం మీది నవ్వు మాసిపోయి కళ్ళు పెద్దవై దెబ్బతిన్న వాలకం వచ్చేసింది. "ఏ పుస్తకమో తెలియక, ఎందుకైనా మంచిదని" అన్నాడు మొహం వ్రేల వేసుకొని. పని సరిగ్గా చేద్దామన్న వుద్దేశ్యంతో తెచ్చాడుగాని నేను అంతగా తిట్టేస్తాననుకున్నట్లు లేదు పాపం.

అదంతా వేషం కాదని స్వామిభక్తి విశేషమనీ అప్పుడే తెలిసింది నాకు. వంటవాడి అసిస్టెంటుగా రామసుబ్బుకు ఉద్యోగం యిచ్చింది నేనే. అందుకేనేమో నన్ను మెప్పించాలని చాల ప్రయత్నిస్తాడు. మిగతా పనివాళ్ళలా కాదు. వాళ్లు పని తప్పించుకోవాలని ప్రయత్నిస్తారు. దూరంగా కనుపించగానే ప్రక్కకు తప్పుకుంటారు. ఎదురుగా వచ్చినప్పుడు నిటారుగా నిలబడి నమస్కారం చేస్తారు.

'ఇవాళ ఎండ ఎక్కువగా వున్నది' అనగానే 'అవునమ్మా, చాలా మాడ్చేసింది' అంటారు. వెంటనే 'ఏవిటింత చల్లగా వుందీ' అంటే 'అవునమ్మా ఎందుకో చల్లగా వుంది' అని సాలోచనగా తల వూపుతారని అనుభవం మీద కనుక్కున్నాను. అందరూ అదే రకం. ఈ ప్రాంతపు తీరు కాబోలు. మొదట్లో రామసుబ్బూ అంతే ననుకున్నాను. 'అతి వినయం ధూర్తలక్షణం' అనుకున్నాను.

నిజమైన ఆదర్శ సేవకులు యీకాలంలో వుండటానికి వీల్లేదు. ఆదర్శాలనేవీ, మంచి అనేదీ కథల్లోనూ, సినిమాల్లోనూ బాగుంటాయిగాని నిజజీవితంలో అపహాస్యంపాలు

జేస్తాయి. తల బొప్పి గట్టిస్తాయి. దాన్ని మనుష్యులు 'సెంటిమెంటాలిటీ' అంటారు. అబలలూ అనుభవహీనులూ మూర్ఖులూ నమ్మేవి అంటారు. లౌకిక వ్యవహారాల్లో మంచితనానికీ చచ్చుతనానికీ భేదం వుండదు. ప్రేమ, స్నేహం, జాలి, క్షమాలాంటి గుణాలు మనుషుల్లో లేవని ఎన్నోసార్లు తెలిసింది నాకు. అన్నిటికీ అట్టడుగున వుండేది స్వార్థం. మంచితనం కోసం వెతికి వెతికి నిరాశ చెందాను.

కేవలం నా సుఖం గురించి ఆలోచించవలసిన అమ్మ ఒకనాడు 'డబ్బు దుబారా చెయ్యకుండా వెనకేస్తే అన్న పిల్లలకు పనికి వస్తుంది' అన్నప్పుడు మాతృప్రేమలో కూడా నమ్మకం పోయింది నాకు. అందుకే రామసుబ్బు అనే పని కుర్రవాడిలో యీ పాతకాలపు లక్షణాలున్నాయని గుర్తుపట్టడానికి నెలరోజులు పట్టింది. తర్వాత 'పాపం, అమాయకుడు' అని జాలిపడ్డాను.

రామసుబ్బులోని మంచితనం అమాయకత్వం చూచాక నాలో చాల మార్పు వచ్చింది. ఏ కాలంలోనో అడుక్కి నెట్టివేయబడ్డ ఆదర్శ శిఖరాలు పైకి లేచాయి. మంచితనంలో మానవతలో తిరిగి విశ్వాసం కలిగింది. రాములవారిని చూచిన ఆంజనేయునిలా రామసుబ్బు నన్ను చాల గౌరవభావంతో చూసేవాడు.

'పాత వార్డెనమ్మ అందరి దగ్గరా చాడీలు వెనక మాటలూ వినేవాళ్ళంటమ్మా. మీరూ న్యాయంగా పోవటమే గాని అలాంటి పనులు చెయ్యరు', 'పావలా యిచ్చి రెండణాల సామాన్లు కొంటే కొట్టు వాళ్ళు పన్నెండు పైసలు వెనక్కిస్తే ఆమె వూరుకునేది కాదట. డబ్బు దగ్గర చాల కచ్చితం.' 'మీరైతే ధారాళంగా వుంటారని అందరూ అంటున్నారు. 'పనివాళ్లు డ్యూటీకి కాస్త ఆలస్యంగా వచ్చినా, సెలవడిగినా, తప్పు చేసినా పాతమ్మగారు చాల కఠినంగా వుండేవారట. మీరు అన్నీ అర్థం చేసుకుంటారు'.

ఇవన్నీ ముఖప్రీతి కోసం ఒక్కసారి అన్నమాటలు కావు. అప్పుడప్పుడూ మాటల్లో బయటపడ్డ విషయాలు. జీవితమంటే కేవలం స్వార్థం కోసం మలుచుకున్నదిగా కాకుండా ఉన్నతమైన విలువల్ని, ఆదర్శాల్ని సాధించేదిగా చూడగలవాళ్ళు కొందరైనా వున్నందుకు సంతోషం కలిగింది.

అమ్మకు గులాబ్‌జాం అంటే చాల యిష్టం. ఆమె వచ్చేసరికి చేయించిపెడితే సంతోషిస్తుంది కదా అనిపించింది. నాకు స్వీట్సుమీద గానీ యితర తినుబండారాల మీదగానీ మోజు లేదు. చిన్నప్పుడు అమ్మ బియ్యం నానబోసి, పిండి దంపించి, భారీ ఎత్తున టిఫిన్లు తయారు చేస్తుంటే నాకు విసుగనిపించేది. తిండి కోసం యింత గందరగోళం ఎందుకు? అనుకునేదాన్ని.

"ఇంత కష్టపడి తయారుచేసుకొని అవి తినకుంటేనేం!" అనేదాన్ని. ఇప్పుడూ ఆ అభిప్రాయం మారలేదు. కాని... యివాళ ఎందుకో నాకు సంతోషంగా వున్నది. ఇవాళ సూర్యుడు పుట్టడమే తెల్లగా పుట్టాడు. నేను వున్నతమైన స్వభావం కలదాన్నని గుర్తించే రామసుబ్బు అనే పనికుర్రవాడు వున్నాడు. ఔన్నత్యమనేది మనస్సును ఒక దివ్యతేజంలో ముంచి ప్రకాశవంతం చే స్తుంది. హృదయాన్ని ఆనందంతో పరవశింపజేస్తుంది... ఇవాళ అమ్మ వస్తున్నది. నాలుగు నెలల తరువాత మంచి కూతురుగా, నాకోసం కాకుండా, కేవలం ఆమె కోసం. ఈ ఒక్క పని చేసి ఆమెను సంతోషపెట్టాలి. అందుకు రామసుబ్బుతో చెప్పాను - కావలసిన వస్తువులు తీసుకొచ్చి నా రూంలోనే స్టౌ మీద గులాబ్‌జాం చెయ్యమని...

"హోటల్ నుంచి తెప్పించావా, బాగుంది" అన్నది అమ్మ.

"కాదు మేమే చేశాంలే" అన్నాను గర్వంగా.

ఆరోజు సాయంత్రం నేను కాలేజి నుండి వచ్చేసరికి బాల్కనీలో అమ్మ రామసుబ్బుతో యిష్టాగోష్ఠి జరుపుతూ ఉంది. ముఖ్యంగా తన కూతురు గొప్పతనం మీద. మాటలు నా రూంలోనికి స్పష్టంగా వినిపిస్తున్నాయి. నవ్వుకుంటూ వింటున్నాను. అప్రస్తుతంగా మధ్యలో అన్నది అమ్మ, "మా అమ్మాయి యివాళ నాకోసం గులాబ్‌జాం చేసింది. ఈమధ్యన నేర్చుకున్నట్లున్నది. చాలా బాగా చేసింది" అన్నది.

ఇలా అంటున్నదేమిటా అని ఆశ్చర్యపోతూ విన్నాను. ఇందాకా 'మేమే చేశాం' అన్నప్పుడు నేనే చేశానన్నట్లుగా అర్థం చేసుకున్నది గాబోలు!

రామసుబ్బు ఏమాత్రం తడబాటు లేకుండా అన్నాడు: "అవునమ్మా, అమ్మగారు నాచేత సామాన్లు తెప్పించి చేశారు. చాలా బాగా చేస్తారు" అని.

నాకు యీ మాటలు పొరపాటుగా విన్పించాయి... గులాబ్‌జాం నేను చెయ్యలేదని రామసుబ్బుకు తెలుసునే! తానేగదా సామాన్లు తెచ్చి తయారుచేశాడు. నేను చేశానని అంత ఘట్టిగా ఎందుకు చెబుతున్నాడు?

మెల్లగా నా మనసులో ఒక చిన్న అనుమానం పుట్టి పర్వత ప్రమాణానికెదిగి కూర్చుంది. నేను అమ్మతో అబద్ధం చెప్పానని రామసుబ్బు అనుకుంటున్నాడా!... నేను అబద్ధాలు చెప్పడం రామసుబ్బుకు ఆశ్చర్యం కలిగించలేదు! అందుకే ఏమాత్రం తొణక్కుండా నా 'అబద్ధాన్ని' సపోర్టు చేశాడు. నాది ఉన్నతమైన స్వభావమనీ, నాకు అల్పబుద్ధులు లేవనీ రామసుబ్బు యిదివరలో అనుకోలేదా? అన్నీ నా వూహలేనా!?

ప్రపంచంలోని మంచితనమంతా శిథిలమైపోయినట్లూ, జీవితంలోని రాగమంతా

చెదిరిపోయినట్లు అనిపించింది. నన్ను నిస్పృత్తువ ఆవరించింది.

'మీరు రావటం నేను చూడనేలేదమ్మగారూ' అంటూ ఫ్లాస్కులో నుంచి కాఫీని కప్పులోనికి పోసి తెచ్చి యిస్తున్న రామసుబ్బు మొహంలో సిగ్గుతో కూడిన నవ్వూ, వినయమూ తప్పించి మరే భావమూ లేదు!

★★★